# రోడ్డున పడ్డ ఎండీయూ ఆపరేటర్లు

**కూటమి వచ్చాక ఉద్యోగాలు ఊడగొట్టారని ఆవేదన • తమకు న్యాయం చేయాలని అభ్యర్థన**

**తాము అధికారంలోకి వస్తే ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలను తీసేస్తోందని ఎండీయూ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఆశలతో వాహనాలను కొనుగోలు చేసి, రేషన్ సరకులను పంపిణీ చేస్తున్నామని ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటంటూ కలవరపడుతున్నారు. ప్రభుత్వం న్యాయం చేయాలనే డిమాండ్‌తో ఆందోళన బాట పట్టారు.**



ఆందోళన బాట పట్టిన ఎండీయూ ఆపరేటర్లు



రేషన్ కార్డుదారుల ఇంటి వద్ద సరకులు పంపిణీ చేస్తున్న ఆపరేటర్లు

**మల్కాపురం:** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఎండీయూ (మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్) వాహనాలను ఏర్పాటు చేసి, రేషన్ వాహనాలను ఇంటివద్దకే సరఫరా చేసింది గత ప్రభుత్వం. రేషన్‌కార్డుదారులు కూడా డిపోలకు వెళ్లే అవసరం లేకుండా ఇంటి వద్దనే సరకులు తీసుకోవడం వారికీ సౌకర్యవంతంగా ఉంది. అయితే, జూన్ ఒకటి నుంచి ఆ వాహనాలను రద్దు చేస్తున్నట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించడంతో అటు ఎండీయూ ఆపరేటర్లు, ఇటు రేషన్‌కార్డు లబ్ధిదారులు కూడా ఆందోళన చెందుతున్నారు.

అర్హులైన రేషన్‌కార్డు దారులకు ఇంటివద్దనే సేవలు అందించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసింది. ఆపరేటర్లు రైస్‌కార్డు దారుల ఇంటి సమీపంలోనే ప్రతీ నెల 1వ తేదీ నుంచి 17వ తేదీ లోపు వ్యాన్ నిలిపి, లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకుని రేషన్ సరకులను అందించేవారు. ములగాడ మండల పరిధిలోని 40, 58, 59, 60, 61, 62 వార్డుల పరిధిలో16 ఎండీయూ వ్యాన్ల ద్వారా రేషన్ సరుకులను పంపిణీ చేసేవారు. అయితే, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఈ నెల 20వ తేదీ నుంచి వారి సేవలను ఆపేశారు. దీంతో ఈ 16 మంది ఆపరేటర్లతో పాటు వారి అసిస్టెంట్లు మరో 16 మంది రోడ్డున పడ్డారు. తమ పరిస్థితి ఏమిటంటూ ఆందోళన బాట పట్టారు.

### మళ్లీ డిపోల వద్ద పడిగాపులు

రైస్ కార్డు లబ్ధిదారులు తమ ఇంటి వద్ద నిలిపిన వ్యాన్ల వద్ద రేషన్ తీసుకునేవారు. వృద్ధులు, మంచం మీద లేవలేని పరిస్థితిలో ఉన్నవారి దగ్గరకు ఆపరేటర్లే వెళ్లి, వాళ్ల బయోమెట్రిక్ తీసుకుని సరకులు ఇచ్చేవారు. దూరాభారం తగ్గడంతో లబ్ధిదారులంతా ఆనందం వ్యక్తం చేసేవారు. పారిశ్రామిక ప్రాంతంలో సుమారు 26 వేల మంది ఈ సౌకర్యాన్ని పొందేవారు. జూన్ నెల నుంచి పూర్వం మాదిరిగా వారు డిపోల చుట్టూ రేషన్ కోసం పడిగాపులు పడాల్సిన రోజులు వచ్చేశాయి. దీంతో లబ్ధిదారుల కష్టాలు మళ్లీ మొదలు కానున్నాయి.

### మాకు న్యాయం చేయాలి



ఇంతకాలం మొబైల్ వ్యాన్లను నమ్ముకుని జీవనం సాగించాం. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్డున పడ్డాం. కుటుంబాలను ఎలా పోషించుకోవాలని అర్థం కావడం లేదు. పాలకులు మా సమస్యను పరిగణనలోకి తీసుకుని మాకు న్యాయం చేయాలి.

– కోరాడ వాసు, ఎండీయూ ఆపరేటర్

### ఎలాంటి సమాచారం లేకుండా ఆపేశారు

మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మమ్మల్ని విధులకు దూరం చేశారు. మమ్మల్ని రోడ్డున పడేశారు. ఉపాధి అవకాశం కల్పించాల్సిన ప్రభుత్వమే, ఉన్న ఉపాధిని నిలిపేస్తే మా పరిస్థితి ఏమిటి? దీనిపై పాలకులు పునరాలోచన చేయాలి.

– కె.సింహాచలం, ఎండీయూ ఆపరేటర్

## క్లుప్తంగా

### 18.5 కిలోల గంజాయి స్వాధీనం

**ఎక్సైజ్ అధికారుల అదుపులో ఇద్దరు నిందితులు**

**తాటిచెట్లపాలెం:** తెలంగాణకు అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులను జ్ఞానాపురం రైల్వే స్టేషన్ సమీపంలో ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాలివి.. విశాఖ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ టీం రవికిరణ్, ముసలనాయుడు, సీతమ్మధార ఎక్సైజ్ సీఐ నాగవేణి, సిబ్బంది సంయుక్తంగా బుధవారం జరిపిన దాడుల్లో ఒడిశా నుంచి హైదరాబాద్‌కు రైలు మార్గంలో గంజాయి తరలించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఒడిశా రాయగడకు చెందిన జిబాన్ జోతిపానీ, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ప్రిన్స్ వికాస్ బోర్డ్స్‌లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 18.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

### త్రుటిలో తప్పిన ప్రమాదం



దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

**మహారాణిపేట:** అగనంపూడి సమీపంలో టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఆర్టీసీ బస్సుకు ప్రమాదం జరిగింది. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో అగనంపూడి హనుమాన్ జంక్షన్ వద్ద టిప్పర్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో కాకినాడ నుంచి విశాఖ వస్తున్న ఆర్టీసీ బస్సు టిప్పర్‌ను ఢీ కొట్టింది. ఆర్టీసీ డ్రైవర్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆర్టీసీ డ్రైవర్ చాకచక్యంగా సడన్ బ్రేక్ వేసి ప్రయాణికులకు ప్రమాదం జరగకుండా బస్‌ను అదుపుచేశారు.బస్సులో సుమారు 45 మంది ప్రయాణికులు ఉన్నారు. అక్కడ ట్రాఫిక్ పోలీస్ ఉన్నా సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతోనే ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**అక్కిరెడ్డిపాలెం:** మారుతీ సర్కిల్ నుంచి ములగాడ మార్గంలో రైల్వే గేటు సమీపాన రోడ్డు పక్కన గుర్తు తెలియని మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించి గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతి చెందిన వ్యక్తి 3 నెలలుగా చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో బిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్లు ఉంటాయని తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి తెలియరాలేదన్నారు. ఎవరైనా గుర్తు పడితే గాజువాక సీఐ 9440796014, ఎస్ఐ 9642364770 నంబర్లకు తెలపాలన్నారు.

### ఐపీఆర్ పీజీ డిప్లొమా విద్యార్థులకు అభినందన



కోర్సు పూర్తి చేసిన విద్యార్థులతో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు

**విశాఖ విద్య:** ఆంధ్ర విశ్వవిద్యాలయం డీపీఐఐటీ–ఐపీఆర్ చైర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీ డిప్లొమో ఇన్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ కోర్స్ విజయవంతంగా పూర్తయింది. ఈ సందర్భంగా కోర్సు పూర్తి చేసిన విద్యార్థులను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. ఏడాది కాల వ్యవధి కలిగిన ఈ కోర్సులో పలువురు వైద్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇంజినీర్లు, ఉన్నత విద్యావంతులు చేరి విజయవంతంగా పూర్తి చేయడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఆవిష్కరణకు ప్రాధాన్యమిస్తూ మేధోహక్కుల పరిరక్షణకు ఏయూ ఐపీఆర్ చైర్ చేస్తున్న కృషిని రిజిస్ట్రార్ అభినందించారు.

### అప్పన్నకు నిత్యకల్యాణం

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి, ఉదయం 9.30 నుంచి వివిధ ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

## అవగాహనతో సైబర్ నేరాలకు చెక్



కార్యక్రమంలో పాల్గొన్న వారికి అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి

**మల్కాపురం:** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి అన్నారు. 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలోని అంగన్‌వాడీ భవనంలో పాఠశాలకు వచ్చే పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులు,కౌమార బాలికలకు సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కల్పించారు.ఆమె మాట్లాడుతూ ఫోన్లకు స్పామ్ కాల్స్,మెసేజ్‌లు వస్తుంటాయని, ఓటీపీ చెప్పాలని బలవంతం పెడతారని,అలాగే ఆధార్ నెంబర్,బ్యాంకు ఖాతా వివరాలు అడిగితే ఇవ్వవద్దని సూచించారు.అనుమానితుల నుంచి లాటరీ పలికిందని ఫోన్ వస్తే వెంటనే పోలీసులను ఆశ్రయించాలన్నారు.

## మహానటుడు ఎన్టీఆర్

**మల్కాపురం:** తెలుగుజాతికి గుర్తింపు తేవడంలో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీరామారావు కృషి ఎనలేనిదని ఎస్ఎస్ఏ జిల్లా నోడల్ అధికారి ఈ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో బుధవారం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నటుడిగా, ముఖ్యమంత్రిగా తీసుకువచ్చిన సంస్కరణలను గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్ వెంకటరావు, గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్, ప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

**గోపాలపట్నం:** జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లో టీడీపీ నాయకుడు నందవరపు సోములు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గోపాలపట్నం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బాల సుబ్రహ్మణ్యం, దాడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు అన్యాయం



కాంట్రాక్ట్ కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

- తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి
- అవసరమైతే ప్రజాప్రతినిధుల ఇళ్లు ముట్టడిస్తాం
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల నిరవధిక సమ్మెకు సీపీఐ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి ప్రకటించారు. ఉక్కు పరిపాలన భవనం వద్ద బుధవారం చేపట్టిన ఆందోళనకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్ కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు 8 వేల మందికి ఇప్పటికీ ఉద్యోగాలు లభించలేదన్నారు. ఎన్నికల ముందు ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షిస్తామని, నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని ప్రజాప్రతినిధులు విస్మరించడం దుర్మార్గమన్నారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామన్నారు. ఉక్కు యాజమాన్యం కార్మికులను తొలగించడం సమంజసం కాదన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు 9 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా యాజమాన్యంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు షేక్ రహమాన్, కసిరెడ్డి సత్యనారాయణ, ఎం. మన్మథరావు, ఎన్. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## జూలో ధోల్ డే సందడి



ఆసియాటిక్ వైల్డ్ డాగ్ చిత్రం వేస్తున్న చిన్నారి

**ఆరిలోవ:** ఇందిరాగాంధీ జూ పార్కులో బుధవారం ప్రపంచ ధోల్ డే(ఆసియాటిక్ వైల్డ్ డాగ్స్ డే) నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్రలేఖనం పోటీల్లో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆసియాటిక్ వైల్డ్ డాగ్స్ చిత్రాలతో అలరించారు. జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ ఆసియా ఖండంలోని అడవి కుక్కల జాతినే ధోల్‌గా పిలుస్తారని తెలిపారు. ధోల్ ప్రపంచంలో ధోల్ ప్రాణులు అంతరించిపోతున్నాయన్నారు. దీని బ్రీడింగ్ సెంటర్‌ను విశాఖ జూలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ డాగ్స్‌పై అవగాహన కల్పించడానికి పిల్లలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు చెప్పారు.

## సాహితీవేత్తలకు ప్రతిభా పురస్కారాల ప్రదానం



డి.వి.సూర్యారావును పురస్కారంతో సత్కరిస్తున్న అతిథులు

**సీతంపేట:** నవసాహితి ఇంటర్నేషనల్, బొంబాయి తెలుగు సాహిత్య సమితి సంయుక్త నిర్వహణలో విశిష్ట ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో నవసాహితి ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎస్.వి.సూర్యప్రకాశరావు తమ సంస్థ కార్యకలాపాల గురించి వివరించారు. ఈ సందర్భంగా గురజాడ కవితా పురస్కారాన్ని కవి కె.జి.వేణుకు, విశిష్ట సాహితీ పురస్కారాలను సాహితీవేత్తలు డాక్టర్ డి.వి.సూర్యారావు, ఆచార్య వెలమల సిమ్మన్నకు ప్రదానం చేసి సత్కరించారు. జర్రా అప్పారావు మాట్లాడుతూ సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉందని, ఆ దిశగా ఉత్తమ సాహిత్య స్రష్టలను సత్కరించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో బొంబాయి తెలుగు సాహిత్య సమితి అధ్యక్షుడు రుద్రాభట్ల శ్రీరాంకుమార్, సాహితీవేత్తలు పిళ్లా రమణమూర్తి, కె.వి.ఎస్.మూర్తి, స్వాతి సోమనాథ్ పాల్గొన్నారు.

### సీపీఐ నేత రామారావుకు నివాళి

**గాజువాక:** సీపీఐ నాయకుడు, గాజువాక చిల్లర వర్తకుల సంఘం అధ్యక్షుడు ఎం.రామారావుకు ఆ పార్టీ నాయకులు బుధవారం నివాళులర్పించారు. గాజువాక మార్కెట్‌లో నిర్వహించిన సంతాప సభలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మార్కెట్ అభివృద్ధితో పాటు చిల్లర వర్తకుల సంక్షేమం కోసం రామారావు చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన ఆకస్మికంగా మృతి చెందడం సంఘానికి, పార్టీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.జె.స్టాలిన్, ఆదారి సూరిబాబు, షేక్ రెహ్మాన్, కసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పన్ను పెంపు నిర్ణయం దుర్మార్గం

**ఉపసంహరించుకోవాలని వార్వా, నివాస్ సంస్థల ధర్నా**



ధర్నా చేస్తున్న వార్వా, నివాస్ సభ్యులు

**బీచ్‌రోడ్డు:** ఆస్తుల సర్వే పేరుతో ప్రాపర్టీ ట్యాక్స్ విలువంటూ ఇంటి పన్ను 20 శాతం పెంచే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విశాఖపట్నం అపార్ట్‌మెంట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వార్వా) అధ్యక్షుడు ఎస్.ప్రకాశరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వార్వా, నివాస్ సంస్థల సభ్యులు సంయుక్తంగా బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణాల్లో ఆస్తుల సర్వే ద్వారా 20 శాతం అదనంగా ఆస్తిపన్ను సమీకరించాలని రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఆదేశించారని గుర్తు చేశారు. దానికనుగుణంగా ఈ నెల 14న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రాష్ట్ర విభాగం సర్క్యులర్ జారీ చేసిందన్నారు. నగరాలు, పట్టణాల్లో ఆస్తులను సర్వే చేసి టాక్స్ అసెస్మెంట్ కానివి, పన్ను విధించవలసిన దాని కంటే తక్కువగా టాక్స్ అసెస్మెంట్ జరిగినవి గుర్తించి, వాటిపై సవరించిన ఆస్తి పన్ను, పెనాల్టీలు వేసి, ప్రతి నగరంలో ఆస్తి పన్ను ఆదాయాన్ని 20 శాతానికి తక్కువ కాకుండా పెంచాలని ఆదేశాలు పంపించడం దుర్మార్గమని మండిపడ్డారు. తక్షణమే ఆస్తి పన్ను సర్వే ఆపి, పాత పద్ధతిలోనే ఇంటి పన్ను వసూలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ధర్నాలో నివాస్ అధ్యక్షుడు బి.గురప్ప, వార్వా కార్యదర్శి బీబీ గణేష్, సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**జీవీఎంసీ బయాలజిస్ట్ వరప్రసాద్**



సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్న మలేరియా నివారణ సిబ్బంది

**సింధియా:** డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా తదితర సీజనల్ వ్యాధుల ప్రబల కుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ బయాలజిస్ట్ జి.వరప్రసాద్ సూచించారు. జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి భద్రత అనే విషయాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. తమ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడంతో పాటు ఇంట్లోని ట్యాంకులు, కుండీలను వారానికి ఒక రోజు శుభ్రపర్చడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చునన్నారు. గృహాల్లో లభ్యమయ్యే చెత్తను రోడ్లు, కాలువల్లో వేయకుండా శానిటరీ సిబ్బందికి అందించాలని సూచించారు. పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ వినియోగాన్ని ఎవరికి వారుగా నియంత్రించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మల్కాపురం ఏరియా మలేరియా ఇన్‌స్పెక్టర్ డి. రవికుమార్, వార్డు మలేరియా సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సినిమా హాళ్ల తనిఖీ



సుకన్య సినిమా హాలులో వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో శ్రీలేఖ, తహసీల్దార్ రమేష్

**గోపాలపట్నం:** గోపాలపట్నంలోని నరసింహ, శ్రీనరసింహ, సుకన్య, సౌజన్య సినిమా హాళ్లను ఆర్డీవో టి.శ్రీలేఖ బుధవారం తనిఖీ చేశారు. హాళ్లలోని మరుగుదొడ్లు, ప్రేక్షకులు కూర్చునే కుర్చీలు, తినుబండారాలు వంటివి పరిశీలించారు. ప్రేక్షకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ తనిఖీ చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన చెక్ లిస్ట్ ప్రకారం సినిమా హాళ్లను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నివేదికను జేసీ ద్వారా ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ఆమె వెంట గోపాలపట్నం తహసీల్దార్ సిహెచ్‌వీ రమేష్, ఆర్ఐ కోమలి, సచివాలయం రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## మత్తుకు బానిసై యువకుడి బలవన్మరణం



శ్యామ్‌కుమార్ (ఫైల్)

**గోపాలపట్నం:** గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసైన యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన కొత్తపాలెం సంతోష్‌నగర్‌లో చోటు చేసుకుంది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం సంతోష్ నగర్‌లో అలద్దపుట్టి శ్యామ్‌కుమార్(20) సోదరుడు రాజు కలిసి నివాసముంటున్నారు. వీరు విజయనగరం జిల్లా సాలూరు మండలం కోనాం గ్రామానికి చెందిన వారు. ఆటో డ్రైవర్లుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శ్యామ్‌కుమార్ గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసయ్యాడు. ఇవి లేకపోతే ఉండలేని పరిస్థితికి చేరుకున్నాడు. ఈ స్థితిలో బుధవారం రాత్రి సోదరుడు లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. రాత్రి రాజు ఇంటికి వచ్చే సరికి ఉరి వేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారమందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ అప్పలనాయుడు, క్లూస్‌టీమ్ వివరాలు సేకరించారు. మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

## ఆదమరిస్తే ప్రమాదమే...



ఎల్‌జీ పాలిమర్స్ జంక్షన్ వద్ద గుంత

**గోపాలపట్నం:** జీవీఎంసీ 92వ వార్డు ఎల్‌జీ పాలిమర్స్ జంక్షన్ వద్ద ప్రధాన రహదారిపై గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. వాహన చోదకులు ఆదమరిస్తే పెను ప్రమాదం తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోపాలపట్నం నుంచి నాయుడు తోట వెళ్లే దారిలో ఎల్‌జీపాలిమర్స్ జంక్షన్ వద్ద ఇటీవల పడిన వర్షాలకు రోడ్డు గుంతలా ఏర్పడింది. ఇది ప్రయాణికుల పాలిట ప్రమాదకరంగా తయారయింది. అలాగే ఎల్‌జీ పాలిమర్స్ జంక్షన్ నుంచి వెంకటాపురం వెళ్లే దారిలో జంక్షన్ సమీపంలో ఉన్న గుంత వాహన చోదకులకు కనిపించని విధంగా ఉంది. దీంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వర్షాలు పెరిగితే గోతులు మరింత ప్రమాదకరంగా తయారవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని కోరుతున్నారు.

## సిబ్బందిపై డీఎంహెచ్‌వో ఆగ్రహం



నరసింహనగర్ యూపీహెచ్‌సీలో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

**మహారాణిపేట:** నరసింహనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు బుధవారం సందర్శించారు. ఈ ఆరోగ్య కేంద్రం పలు కార్యక్రమాల అమలులో వెనుకంజలో ఉండడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అభ ఐడి నమోదు, ఎన్‌సీడీసీడీ సర్వే, వ్యాధి నిరోధక టీకాల అమలు వేగవంతం కావాలన్నారు. ఈ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం తగదన్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ప్రణాళికాబద్ధంగా జరగాలని, నిర్దేశించిన సూచనల ప్రకారం వ్యాక్సిన్ తెచ్చుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ఓపీ, ల్యాబ్ టెస్టులు, సాధారణ ప్రసవాల గురించి వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆశ కార్యకర్తలు తమ ఏఎన్ఎంలతో కలిసి గర్భిణులకు టీటీ, ఐరన్ ఫోలిక్ మాత్రలు అందేటట్లు, ఎనీమియా బారిన పడకుండా చూడాలని అన్నారు. ఈ సందర్భంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ లూసీ, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, డీపీఎంవో, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఆర్‌యూ సందర్శన



ఆస్పత్రి నిర్వహణ గురించి చర్చిస్తున్న అధికారులు

**మల్కాపురం:** జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెంలోని ఫస్ట్ రిఫరల్ యూనిట్ (ఎఫ్ఆర్‌యూ) నిర్వహణ బాధ్యతలను కోరమాండల్ సంస్థ తీసుకోవాలనే ఆలోచనలో ఉంది. ప్రస్తుతం ఈ ఆస్పత్రి సేవలు సరిగ్గా అందకపోవడంతో ఇక్కడకు వచ్చే రోగుల సంఖ్య బాగా తగ్గింది. దీంతో ఆస్పత్రి నిర్వహణ బాధ్యతలను తీసుకుని.. నామమాత్ర ఫీజుతో పారిశ్రామిక ప్రాంత రోగులకు ఉత్తమ సేవలు అందించాలనే ఆలోచనతో కోరమాండల్ యాజమాన్యం ముందుకు వచ్చింది. దీనిలో భాగంగా ఆ సంస్థకు చెందిన చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్‌తో సహా పలువురు ఉన్నతాధికారులు బుధవారం ఎఫ్ఆర్‌యూను సందర్శించారు. పరిసరాలను పరిశీలించి,పూర్తి స్థాయి ఆధునికీకరణ, వసతుల కల్పనకు అయ్యే ఖర్చు తదితర అంశాలపై చర్చించారు.